క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): అగరాలలో ఇందు, పూతలపట్టు మండలం మిట్టూరుకు చెందిన ప్రవీణ్‌కు వివాహం నిశ్చయమైంది. వారికి ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. అగరాల డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, బాలకృష్ణ, పఠాన్ రహీమ్, సావిత్రమ్మ, లక్ష్మణాచారి, గోపాల్ శెట్టి, మునిరాజ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి(తిరుపతి రూరల్): మండల స్థాయి అధికారులు, సంఘాల ప్రతినిధులతో కలిసి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తామని చంద్రగిరి తహసీల్దార్ శిరీష తెలిపారు. ఆమె శనివారం మండల స్థాయి ఎస్సీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని ఆరోపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాలు ప్రారంభం



సంకీర్తనల గోష్టిగానం చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శనివారం తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నమాచార్య ప్రాజెక్టు, స్థానిక కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం ఆకట్టుకుంది. అనంతరం అన్నమయ్య విగ్రహానికి హారతి, మహానివేదన చేపట్టారు. సాయంత్రం తిరుపతికి చెందిన రఘునాథ్, సర్వేశ్వరి బృందం ప్రదర్శించిన సంగీత కచేరి శ్రవణానందకరంగా సాగింది. రాత్రి 7 గంటలకు మదనపల్లికి చెందిన శారద బృందం హరికథాగానంతో భక్తులను ఆకట్టుకున్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ మాజీ అధ్యక్షుడికి నివాళి

పాకాల: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం అంబేద్కర్ భవన్ వ్యవస్థాపకుడు ఎద్దుల సుబ్రమణ్యంకు సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని జరుపుకున్నారు. అంబేద్కర్ భవన్ అధ్యక్షుడు ఆనందయ్య మాట్లాడుతూ సుబ్రమణ్యం భవన నిర్మాణానికి, అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు.

కారును ఢీకొన్న బస్సు



బస్సు ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

చంద్రగిరి(తిరుపతి రూరల్): తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి భాకరాపేట ఘాట్‌లో శనివారం కారును బస్సు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. చంద్రగిరి పోలీసుల కథనం మేరకు.. భాకరాపేటకు చెందిన మహేష్, రమేష్, కిషోర్, రామయ్య కారులో భాకరాపేట నుంచి తిరుపతి వస్తున్నారు. ఘాట్ వద్ద కారును తిరుపతి నుంచి రాయచోటికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసపత్రిలో ఉద్యోగులు, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా కోరారు. ఆయన శనివారం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్టాఫ్ నర్సులు, పారామెడికల్, నాలుగో తరగతి ఉద్యోగులకు ఒకే ప్రాంతంలో నెలల తరబడి విధులు కేటాయించడం వల్ల ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. రొటేషన్ పద్ధతిలో విధులు కేటాయించాలని కోరారు. నర్సులకు సెలవులు మంజూరు బాధ్యతల్ని నర్సింగ్ సూపరింటెండెంట్‌కే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, జాయింట్ సెక్యూరిటీలు ముఖేష్, హరి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పదిలో మెరిసిన పేద విద్యార్థులు

- చంద్రగిరిలో 1448 మంది విద్యార్థులు పాస్
- ఉత్తీర్ణత శాతం 70
- మౌలిక వసతులు, మెరుగైన బోధనతోనే..



తిరుపతి రూరల్/పాకాల/రామచంద్రాపురం/భాకరాపేట: పదవ తరగతి ఫలితాల్లో చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థులు విజయదుందుబి మోగించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 50 హైస్కూల్స్‌లో 2,137 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,448 మంది ఉత్తీర్ణులయ్యారు. 70.14 శాతం నమోదైంది. ఇందులో 51 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన మౌలిక వసతులు, సమర్థవంతమైన విద్యా బోధనతోనే ఉత్తీర్ణత శాతం పెరిగినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. అత్యధికంగా రామచంద్రాపురం మండలంలో 81 శాతం, ఎర్రావారిపాలెంలో 75 శాతం, చంద్రగిరిలో 70 శాతం, పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల్లో 68 శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించారు. తిరుపతి రూరల్ మండలంలో 52.54 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు. చంద్రగిరి బాయ్స్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించి నియోజకవర్గంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి అభినందనలు

మంచి మార్కులు సాధించిన విద్యార్థులను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభినందించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు త్వరలోనే వైఎస్సార్ గోల్డ్ మెడల్స్, కంప్యూటర్స్, ట్యాబ్‌లను కానుకగా అందించనున్నట్లు తెలిపారు. మండల టాపర్‌గా నిలిచిన చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు, ప్రొ చాన్సలర్ మంచు విష్ణు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ

భాకరాపేట : ఎర్రావారిపాళెం ఏపీ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థినులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ బీటీ శ్రీదేవి తెలిపారు. 10 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారని వెల్లడించారు.

తిరుపతి సత్యనారాయణపురంలో..

తిరుపతి మంగళం : తిరుపతి సత్యనారాయణపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది పరీక్షలు రాయగా 114 మంది ఉత్తీర్ణత (60 శాతం) సాధించారు. వారిని ప్రధానోపాధ్యాయురాలు డి.సంధ్యారాణి అభినందించారు. అదేవిధంగా మంగళంలోని ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో 163 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వంద మంది ఉతీర్ణత సాధించారు.

టీటీడీ విద్యాసంస్థల విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రీకోదండరామస్వామి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 122 మందిలో 106 (87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్వీ హైస్కూల్‌లో 91 శాతం, శ్రీకపిలేశ్వరస్వామి ఉన్నత పాఠశాల విద్యార్థులు 83 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. వారిని అధికారులు అభినందించారు.

మండలం	హైస్కూళ్లు	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులైన వారు	శాతం	ప్రతిభ చాటినవారు
తిరుపతి రూరల్	10	508	268	52.54	8
చంద్రగిరి	11	572	402	70	12
పాకాల	6	382	261	68.6	4
చిన్నగొట్టిగల్లు	3	105	71	68	4
రామచంద్రాపురం	9	280	229	81.7	6
ఎర్రావారిపాలెం	11	290	217	75	17
మొత్తం	50	2137	1448	70.14	51

నగర అభివృద్ధిలో చెరగని ముద్ర వేస్తా

- ఈ అవకాశం స్వామి అనుగ్రహం
- ప్రజల భాగస్వామ్యానికి పెద్దపీట
- ఐఏఎస్‌నా చిన్ననాటి కల
- నాన్నే నా రోల్ మోడల్
- యువత అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి
- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత



తిరుపతి తుడా: ×ఐఏఎస్ కావాలన్నది నా చిన్ననాటి కల. ఇందుకోసం పాఠశాల దశ నుంచే దృష్టి పెట్టాను. స్టేట్ గ్రూప్–1లో అత్యుత్తమ ర్యాంకు సాధించాను. పదేళ్లలో ఐఏఎస్‌గా అవకాశం వచ్చింది. నేటి యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు తగ్గట్టు నిరంతరం కృషి చేయాలి. ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నాయి. యువత వాటిని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలవైపు వెళ్లాలి¤ అని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అన్నారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమెతో సాక్షితో మాటామంతి..

కుటుంబ నేపథ్యం

అమ్మ వై.నిర్మల (అడ్వకేట్), నాన్న తహసీల్దార్‌గా పనిచేశారు. అన్న హరికిషోర్ ఏఎంవీగా పనిచేస్తున్నారు. తమ్ముడు హరికిషన్ ఇంప్రెస్ ఈవెంట్స్ ఆర్గనైజర్. బీటెక్ పూర్తి చేశాక సివిల్స్‌పై దృష్టి సారించాను. 2012లో గ్రూప్–1లో మంచి ర్యాంకు వచ్చింది. డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. తహసీల్దార్‌గా నాన్న హోదాను చిన్నప్పుడే గుర్తించాను. అందుకే ఐఏఎస్ కావాలనుకున్నాను. నాన్నే రోల్‌మోడల్. కడప, నెల్లూరు ప్రాంతాల్లో పనిచేశాను. 2019 నుంచి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పనిచేశాను. సివిల్స్–2018 బ్యాచ్‌గా డిక్లేర్ చేస్తూ 2022లో ఐఏఎస్‌గా పదోన్నతి పొందాను. త నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఏడాది కాలం పనిచేశాను.

తిరుపతిలో పనిచేయడం ఎలా అనిపిస్తోంది ?

తిరుపతిలో కమిషనర్‌గా అవకాశం స్వామి అనుగ్రహం. తిరుపతి అభివృద్ధిలో చెరగనిముద్ర వేస్తా. అదనపు కమిషనర్‌గా, నెల్లూరు కమిషనర్‌గా అనుభవం ఎంతో ఉపయోగపడుతోంది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కౌన్సిల్ పాలక మండలి సభ్యులు నగరాభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. పనిచేయాలన్న నాకు ఇదో పెద్ద ఎస్సెట్ అనే చెప్పాలి.

స్వచ్ఛతకు మీరిచ్చే ప్రాధాన్యత ?

స్వచ్ఛ సర్వేక్షన్, స్మార్ట్ సిటీల సత్ఫలితాలతో తిరుపతికి బ్రాండ్ ఏర్పడింది. ఇందుకు తగ్గట్టే రాజీలేని నిర్ణయాలు ఉంటాయి. ఆధ్యాత్మిక నగరానికి మరింత కొత్త సొబగులు తీసుకువస్తా. మన ఇల్లు– మన తిరుపతి అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్వచ్ఛతలో భాగస్వాములు చేస్తాం. పర్యాటకులు, భక్తులను దృష్టిలో ఉంచుకొని మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

వేసవి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ?

గతానికి భిన్నంగా పాలన అందించాలన్నదే నా మొదటి ప్రాధాన్యత. సమ్మర్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేశాను. ఇకపై నిర్దేశించిన సమయంలో నీటి సరఫరా ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం నీటి సరఫరా ఉంటుంది. అవసరమైతే అదనపు బోర్లు వేస్తాం.

పాలన గాడి తప్పినట్టుంది

గత విషయాలను పూర్తిగా పక్కన పెట్టా. సమయపాలన, విధి నిర్వహణలో అంకిత భావం ఉండాలి. తప్పులను ఉపేక్షించబోం. సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టాలి. వార్డు సెక్రటరీలతో పాటు వలంటీర్లు ప్రతిరోజూ ప్రజలతో మమేకమవ్వడమే వారి ప్రధాన విధులు.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయి..?

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువచేయాలి. శ్రీనివాస సేతు, డిస్ట్రిక్ట్ ఆర్ట్ థియేటర్, ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, వినాయక సాగర్ ప్రాజెక్టులు దాదాపు పూర్తికావచ్చాయి. పెండింగ్‌లోని పనులన్నీ వేగంగా పూర్తిచేస్తాం. వార్డులవారీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం



అధికారులతో మాట్లాడుతున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయాలని స్మార్ట్ సిటీ ఎండీ డి.హరిత ఇంజినీర్లను ఆదేశించారు. ఆమె శనివారం స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. శ్రీనివాస సేతు, అండర్ విద్యుత్ కేబుల్, వినాయకసాగర్, షాపింగ్ కాంప్లెక్స్ తదితరాలపై కాంట్రాక్టర్లతో మాట్లాడారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. అలానే పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం గురించి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్‌ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈఈలు దేవిక, సంజయ్‌కుమార్, మహేష్, గోమతి, మోహన్, ఏవో రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం ఎమ్మెల్యేలు నవాజ్ బాష, మేడా మల్లికార్జున్ రెడ్డి, సెంట్రల్ లా కమిషనర్ జస్టిస్ రీతురాజ్ అవాస్తి, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్ఎస్ రావత్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

తిరుపతి కల్చరల్: కార్మికులతోపాటు జర్నలిస్టులకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీటీడీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో అత్యంత కీలక పాత్ర పోషించే జర్నలిస్టులకు కనీస వేతనాలు లేక జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. వీరందరికీ కనీస వేతనంగా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో సత్యాగ్రహ దీక్ష చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన గాంధీ మనవడు అనిల్ మనీలాల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శిఖర కలశానికి బంగారు తొడుగు



బంగారు తొడుగును అందిస్తున్న ఆర్యవైశ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేకం నేపథ్యంలో అమ్మవారి గర్భాలయ శిఖర కలశానికి బంగారు తొడుగును శనివారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అందించారు. సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ 140 గ్రాముల బంగారంతో కలశానికి తాపడం చేయించామని, అమ్మవారి ఆశీస్సులతోనే మహద్భాగ్యం దక్కిందని తెలిపారు. అలాగే తమ వంతుగా మహా కుంభాభిషేక పూజలకు అవసరమైన సుమారు రూ.50 వేలు విలువైన దీక్ష వస్త్రాలు అందించినట్లు వివరించారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



నిందితులతో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

భాకరాపేట: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. ఆయన శనివారం భాకరాపేట సర్కిల్ కార్యాలయంతోపాటు పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. రౌడీ షీటర్లు, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎర్రచందనం కేసుల్లో నిందితులతో సమావేశమై పలు హెచ్చరికలు జారీ చేశారు. భాకరాపేట సీఐ యశ్వంత్, ఎస్ఐ ప్రకాష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సంగీత నృత్యోత్సవాలు



నృత్యం చేస్తున్న కళాకారులు





తిరుచానూరు(చంద్రగిరి): శిల్పారామంలో శనివారం సంగీత నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంతో పాటు తెలంగాణ, కేరళ నుంచి వివిధ కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఏఓ ఖాదర్‌వలి తెలిపారు. శనివారం నిర్వహించిన ప్రదర్శన ప్రేక్షకులను అబ్బురపరిచింది. హైదరాబాద్‌కు చెందిన నరసింహారావు బృందం–కూచిపూడి, కేరళకు చెందిన బద్ర నాయర్ మోహిని ఆట్టం, తెలంగాణకు గోదావరిఖణికి చెందిన రవికుమార్–కూచిపూడి, తిరుపతికి చెందిన వరలక్ష్మీ బృందం–జానపద నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. అనంతరం శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి వారిని సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్టుమెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 59,849 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,097 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.2.72 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 10 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మణిపూర్‌లో తెలుగు వారి కోసం హెల్ప్‌లైన్

తిరుపతి అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు వారిని రక్షించడానికి న్యూఢిల్లీలోని ఏపీ భవనంలో హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్కడ మన రాష్ట్రం విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే తల్లిదండ్రులు వారికి ఈ హెల్ప్‌లైన్ నంబర్లు తెలియజేస్తే రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లు 011–23384016, 011–23387089 సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యమ స్ఫూర్తితో రోడ్ల అభివృద్ధి



రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లను ఉద్యమ స్ఫూర్తితో శరవేగంగా నిర్మిస్తున్నట్లు మేయర్ ఆర్.శిరీష, కమిషనర్ హరిత తెలిపారు. వారు శనివారం అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ రోడ్లతో తిరుపతికి కొత్త శకం మొదలుకానుందన్నారు. ఆదివారం ఉదయం శ్రీ పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి మార్గం, తొండమాన్ చక్రవర్తి మార్గం ప్రారంభించనున్నట్టు చెప్పారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ కొర్లగుంట వాసుల ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గంగమ్మగుడి మాస్టర్ ప్లాన్ రోడ్డుతో ప్రజలకు ఎంతో ఉపశమనం కలగనుందన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అదనపు కమిషనర్ సునీత, ఎస్‌ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కే బాబు. కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథరెడ్డి, మునిరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపీ, రవి పాల్గొన్నారు.

గుత్తా మునిరత్నంకు నివాళి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్: రాస్ గుత్తా మునిరత్నం వర్ధంతిని శనివారం రాస్ భవన్ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికిపైగా కంటి పరీక్షలు చేశారు. 70 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అలాగే రుయా, ప్రసూతి ఆసుపత్రి, బాలాజీ బస్టాండ్, అలిపిరి, కపిలతీర్థం ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఫుడ్ ప్యాకెట్లు, మంచినీరు బాటల్స్ పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శిఎస్. వెంకటరత్నం, వి.నాగరాజు, యువరాజ్, మోహన్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ కమిషనర్ భాస్కర్

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లికి సమీపంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ పక్కనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని శనివారం విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ పరిశీలించారు. స్థలానికి కంచె నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మొహిదీన్‌బాషాను ఆదేశించారు. అనంతరం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. నెలవారి అకడమిక్ రివ్యూ సమావేశాన్ని కళాశాల విద్య ఆర్‌జేడీ డాక్టర్ బాబు నిర్వహించారు. రికార్డులు, అధ్యాపకుల పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో చిత్తూరు, పీలేరు కళాశాలలో ప్రిన్సిపాళ్లు ఆనంద రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలల విజయకేతనం

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఉత్తీర్ణతా శాతం సాధించి ప్రతిభ చాటారు.

విశ్వంలో..

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రత్నం పాఠశాలలో..

తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ప్రతిభ కనబరిచినట్లు తిరుమల బైపాస్ రోడ్డులోని రత్నం పాఠశాల ప్రిన్సిపాల్ టి.పురుషోత్తమరెడ్డి తెలిపారు.

హోలీగ్రీన్ పాఠశాలలో..

తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు శ్రీనివాసపురంలోని హోలీగ్రీన్ పాఠశాల చైర్మన్ సి.వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ బి.హరినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మాతృశ్రీ పాఠశాలలో..

తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని రైల్వేకాలనీలోని మాతృశ్రీ పాఠశాల కరస్పాండెంట్ కె.సుధాకర్‌నాయుడు తెలిపారు.

శ్రీచైతన్య పాఠశాలలో..

తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థ ఏజీఎంలు సురేష్, శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

చైతన్య భారతి హైస్కూల్‌లో..

హథీరాంజీకాలనీలోని చైతన్యభారతి హైస్కూల్ విద్యార్థులు 91 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.జనార్దన్ రెడ్డి తెలిపారు.

గీతం పాఠశాలలో..

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని గీతం పాఠశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు.

సిల్వర్ ఓక్స్ పాఠశాలలో..

తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని భవానీనగర్‌లోని సిల్వర్ ఓక్స్ పాఠశాల అధినేత కేఎస్.వాసు ఒక ప్రకటనలో తెలిపారు.

రెడ్ చెర్రీస్ పాఠశాలలో..

పది ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని రెడ్ చెర్రీస్ పాఠశాల డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

భాష్యంలో..

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో భాష్యం విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరచినట్లు ఆ విద్యాసంస్థ జోనల్ ఇన్‌చార్జ్ ఎల్.లక్ష్మణరావు తెలిపారు.

సెవెన్ హిల్స్ పాఠశాలలో..

సెవెన్ హిల్స్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం.హరనాథశర్మ తెలిపారు.

శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో..

హథీరాంజీకాలనీలోని శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమీ విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి, సీఈఓ బి.అలేఖ్యరెడ్డి తెలిపారు.

ప్రభాత్ హైస్కూల్‌లో..

పది ఫలితాల్లో ప్రభాత్ హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని డాక్టర్ వి.జ్యోతి తెలిపారు.

ప్రసన్నభారతిలో..

పది ఫలితాల్లో ప్రసన్నభారతి పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల అధినేత కె.ఈశ్వరయ్య తెలిపారు.